# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ త్రివిధ దళాలు కలిసి పని చేయడం నేటి రక్షణ అవసరాలకు తప్పనిసరి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేసింది.
- ❖ మహిళల వన్డే ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లో భారత్ శ్రీలంకకు 270 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.
- ❖ అక్టోబర్‌లో సాధారణం కంటే 15 శాతం ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది.

===========================

త్రివిధ దళాలు కలిసి పని చేయడం నేటి రక్షణ అవసరాలకు తప్పనిసరి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు “త్రివిధ దళాల సమన్వయం” అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ప్రసంగిస్తూ… ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశం తన గగనతలం రక్షణలో అద్భుతమైన సమన్వయాన్ని ప్రదర్శించిందన్నారు. భారత వైమానిక దళానికి చెందిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ యుద్ధ సమయంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. గతంలో కంటే యుద్ధం ముప్పు ఇప్పుడు మరింత సంక్లిష్టంగా మారిందని 21వ శతాబ్దపు రక్షణ అవసరాలు సంపూర్ణంగా నెరవేరేందుకు త్రివిధ దళాల మధ్య పరస్పర సమన్వయం ఎంతో అవసరమని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

(వాయిస్ 27 సెకన్లు)

===========================

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేసింది. ఈ తుది జాబితా ప్రకారం, 7.42 కోట్ల మంది ఓటర్లు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఈ తుది ఓటర్ల జాబితా ఆధారంగానే జరగనున్నాయి.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) చేపట్టిన అనంతరం గత ఆగస్టు 1న 7.24 కోట్ల మంది ఓటర్లతో కూడిన ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. అయితే ఆ తరువాత ముసాయిదా ఓటర్ల జాబితాలో 21.53 లక్షల మంది అర్హులైన ఓటర్లను ఫారం-6 ద్వారా చేర్చి ఈరోజు తుది జాబితాను విడుదల చేశారు.

===========================

భవిష్యత్‌లో అణ్వాయుధాల నుండి వచ్చే రేడియో ధార్మిక కాలుష్యానికి వ్యతిరేకంగా సంసిద్ధంగా ఉండాలని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీలో మిలిటరీ నర్సింగ్ సర్వీస్ 100వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... కోవిడ్ అనంతర కాలంలో బయో థ్రెట్స్ పెరిగే అవకాశం ఉందని వాటిని ఎదుర్కొనేందుకు రక్షణ రంగం సిద్ధంగా ఉండాలన్నారు. అణు బెదిరింపులకు భారత్ తలొగ్గదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును అనిల్ చౌహాన్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

(వాయిస్ 30 సెకన్లు)

===========================

సాంస్కృతిక హక్కుల పరిరక్షణకు భారత్ కట్టుబడి ఉందని కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ స్పష్టం చేశారు. స్పెయిన్ లో జరిగిన “ప్రపంచ సాంస్కృతిక విధానాలు సుస్థిరాభివృద్ధి సదస్సు”లో ఆసియా పసిఫిక్ కూటమికి అధ్యక్షత వహించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యునెస్కో నిర్వహించిన ఈ సదస్సులో పలు దేశాలకు చెందిన మంత్రులు, రాయబారులు పాల్గొని సాంస్కృతిక విధానాలపై చర్చించారు. అదే విధంగా వారసత్వ పరిరక్షణ, సృజనాత్మక పరిశ్రమలు, మ్యూజియాలు, లలితకళలు మొదలైన రంగాలలో సహకారాన్ని పెంచుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సందర్భంగా చర్చించారు.

===========================

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్ది ఉత్సవాలు న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ లో రేపు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరవుతారు. దేశ ప్రజలకు ఆర్‌ఎస్‌ఎస్ అందిస్తున్న సేవలను ప్రతిబింబించేలా రూపొందించిన ఒక ప్రత్యేక స్మారక తపాలా బిళ్లనూ, స్మారక నాణాన్ని ప్రధానమంత్రి రేపు విడుదల చేస్తారు. అనంతరం ఆహ్వానితులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

===========================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. “సేవా పర్వ్” పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా అంతరిక్ష ప్రయాణంపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 100 సెకన్లు)

===========================

జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రతి ఇంటికి చేరవేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' అనే ప్రచార కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ప్రారంభించింది. వ్యవసాయం, ఎం.ఎస్.ఎం.ఈ.లు, చేనేత, ఆక్వా కల్చర్, విద్య, బీమా రంగం, ఎలక్ట్రానిక్స్, ఇ-కామర్స్, పర్యాటకం, ఆతిథ్యం, రవాణా, లాజిస్టిక్స్, క్రీడా పరికరాలు, పునరుత్పాదక

ఇంధనం, ఆటోమొబైల్స్ వంటి రంగాలలో జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను పౌరులకు తెలియజేసేలా ఈరోజు నుండి అక్టోబర్ 19 వరకు రాష్ట్ర ప్రభుత్వం వరుస కార్యక్రమాలను రూపొందించింది.

============================

గాజా సంక్షోభాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సమగ్ర ప్రణాళికను భారత్ స్వాగతించింది. పాలస్తీనా, ఇజ్రాయెల్ తో పాటూ పశ్చిమాసియా ప్రాంతానికి ఇది దీర్ఘకాలిక, స్థిరమైన శాంతి మార్గాన్ని అందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. డొనాల్డ్ ట్రంప్ చొరవకు ఇరు పక్షాలు కలిసి వస్తాయని.. ఈ సంఘర్షణను అంతం చేసి శాంతిని నెలకొల్పడానికి మద్దతు ఇస్తాయని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

============================

అక్టోబర్‌లో సాధారణం కంటే 15 శాతం ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. ఈరోజు అక్టోబర్ మాసానికి సంబంధించిన వర్షపాతం అంచనా వివరాలను IMD డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర వెల్లడించారు. ఈశాన్య, వాయువ్య భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో అక్టోబర్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. గత నాలుగు నెలల రుతుపవనాల కాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసాయని IMD డైరెక్టర్ జనరల్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

============================

భారత్ శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న మహిళల వన్డే క్రికెట్ కప్ తొలి మ్యాచ్‌లో భారత్ శ్రీలంకకు 270 పరుగుల లక్ష్యాన్ని నిర్ధేశించింది. అమన్‌జ్యోత్ కౌర్ 57 పరుగులు, దీప్తి శర్మ 53 పరుగులు చేయడంతో 47 ఓవర్లకు భారత్ 8 వికెట్లు నష్టపోయి 269 పరుగులు చేసింది. పలు మార్లు వర్షం అంతరాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం శ్రీలంకకు 270 పరుగుల లక్ష్యాన్ని నిర్ధేశించారు.

============================
============================